క్లుప్తంగా

గౌతమేశ్వరాలయంలో అనగాష్టమి వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక గోదావరి తీరాన గౌతమేశ్వరాలయంలో మంగళవారం దత్త భక్తులచే అనగాష్టమి వ్రతం ఘనంగా నిర్వహించారు. గత నెలలో ఆలయంలో ప్రారంభమైన అనగాష్టమి వ్రతం రెండో మాసంలో కూడా నిర్వహించగా భక్తులు తరలివచ్చారు. ఆలయ సభ్యులు శ్రీదేవి, ప్రోగ్రాం చైర్మన్ శ్రీనివాస్, దత్త భక్తులు పాల్గొన్నారు.

జిల్లా ఖజానాధికారికి సన్మానం

మంచిర్యాలఅర్బన్: నూతనంగా జిల్లా ఖజానా అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.రాజగోపాల్‌ను మంగళవారం ఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామక్రిష్ణ, కార్యదర్శి శ్రీనివాస్, హాజీపూర్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, దండేపల్లి మండలశాఖ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: అనుమతులు లేకుండా అడ్మిషన్లు ప్రారంభించిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. గతంలో అనుమతులు లేకుండా నిర్వహించిన పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మోసపోయిన విషయాన్ని గుర్తుచేశారు. ఓ పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు అయిందని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆ పాఠశాలకు గుర్తింపు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్‌బీ జిల్లా బాధ్యుడు సన్నీగౌడ్ లు పాల్గొన్నారు.

పేదింటి బాలిక వైద్యానికి చేయూత



బాధితురాలి తల్లికి ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్: పేదింటి బాలిక వైద్యానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అండగా నిలిచారు. మండలంలోని మాదారం త్రీ ఇంక్‌లైన్ గ్రామానికి చెందిన శనిగారపు సుజాత పెద్ద కుమార్తె శ్రావణి కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. నిమ్స్‌లో వైద్యం తీసుకుంటున్న శ్రావణి విషయం తెలుసుకున్న మాదారం ఎంపీటీసీ సూరం రవీందర్ రెడ్డి ఈ విషయాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ బాధితురాలు వైద్యానికి రూ.ఐదు లక్షలు ఎల్‌ఓసీని అందజేశారు.

భీమారం మండల బీజేపీ అధ్యక్షుడిగా శంకర్

భీమారం: భారతీయ జనతా పార్టీ భీమారం మండల అధ్యక్షుడిగా కాజిపల్లి గ్రామానికి చెందిన బోరుకుంట శంకర్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మంగళవారం తెలిపారు.

హన్మాన్ దీక్ష స్వీకరణ



మాలధారణకు హాజరైన భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద పలువురు భక్తులు మంగళవారం హన్మాన్ దీక్షా మాలధారణ చేసుకున్నారు. 481మంది మాలాధారణ చేసుకున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. మాలధారణ చేసుకున్న భక్తులు గుట్టపై గల శ్రీసత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం 18మంది భక్తులకు అర్చకులు హనుమాన్ మాలధారణ చేశారు. ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు మాలలు వేశారు. కార్యక్రమంలో అర్చకులు గౌరోజు జగన్ ఆచార్య, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.



నీళ్లలో ఇరుక్కుపోయిన స్కూల్ బస్సు(ఫైల్)

నీరు నిలిచి ఉన్న కొత్తపల్లి వారసంత అండర్ బ్రిడ్జి

నిధులు నీళ్లపాలు..!

- అనాలోచిత పనులతో రైల్వే అండర్ బ్రిడ్జిల్లో నీటి నిల్వ
- ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ ఏర్పాటుకు అధికారుల చర్యలు
- సమస్య పరిష్కారం కాక వాహనదారులకు ఇక్కట్లు

తాండూర్: అధికారుల అనాలోచిత నిర్ణయం ప్రజలను అష్ట కష్టాలకు గురి చేస్తోంది. రూ.కోట్ల నిధులు వెచ్చించినా రహదారి సమస్యకు పరిష్కారం కానరావడం లేదు. రైల్వే గేట్ వల్ల నెలకొన్న ఇబ్బందులను తప్పించేందుకు నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలు ప్రజలకు నరకాన్ని చూపుతున్నాయి. నిత్యం వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వర్షాకాలంలో రైల్వే అండర్ బ్రిడ్జిల నుంచి రాకపోకలు సాగించడానికి సర్కస్ ఫీట్లు పడాల్సిన పరిస్థితి ఉన్నా, రైల్వే అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అండర్ బ్రిడ్జిలు సమస్యాత్మకంగా మారడంతో మళ్లీ సుమారు రూ.7కోట్ల అంచనా వ్యయంతో పైప్‌లైన్ నిర్మాణం సాగుతున్నా సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు.

ముమ్మాటికీ అనాలోచిత నిర్ణయమే....

సాధారణంగా ఇటువంటి రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టినప్పుడు వర్షపు నీరు, నిత్యం వచ్చే ఊట నీరు బయటకు వెళ్లేలా ఎత్తు వంపులు చూసుకుని నిర్మించాల్సి ఉంటుంది. ఇది పూర్తిగా సాంకేతికత ఆధారంగా చేపట్టాల్సిన పని. కానీ కొత్తపల్లి వారసంత ప్రాంతం, రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలోని బ్రిడ్జిల నిర్మాణాలు ఇందుకు భిన్నంగా సాగినట్లు తెలుస్తోంది. నీరంతా బ్రిడ్జిల్లోనే నిల్వ ఉండి ఎటు వెళ్లే మార్గం లేకపోవడంతో, అధికారులు తాత్కాలికంగా మోటర్లు ఏర్పాటు చేసి నీటిని తోడేసే చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ పూర్తిగా నీరు బయటకు వెళ్లక రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రస్తుతం ఊట నీరు రోజుకు మూడు పూటలు బయటకు వెలికి తీస్తే గానీ అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా ఉంది.

మరో రూ.7కోట్లతో పైప్‌లైన్ పనులు...

అధికారుల తప్పిదంతో సమస్యాత్మకంగా మారిన అండర్ బ్రిడ్జిల సమస్యను పరిష్కరించేందుకు అధికారులు మరో రూ.ఏడు కోట్లతో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. రైల్వే అండర్ బ్రిడ్జిల్లో నిల్వ ఉంటున్న నీటిని ఈ పైప్‌లైన్ ద్వారా లోతట్టు ప్రాంతానికి తరలించేలా నిర్మిస్తున్నారు. అయినా కూడా అవి అంత ఆశాజనకంగా సాగినట్లు కానరావడం లేదు.

తాండూర్ పరిధిలో మూడు

తాండూర్ మండల పరిధిలో మూడు చోట్ల రైల్వే అండర్ బ్రిడ్జిలను నిర్మించారు. కొత్తపల్లి వారసంత సమీపంలో, రేచిని రోడ్ రైల్వే స్టేషన్ వద్ద, కాసిపేట గ్రామానికి వెళ్లే మార్గంలో.. అండర్ బ్రిడ్జిలు నిర్మించారు. ఒక్కో బ్రిడ్జి సుమారు రూ.3కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణాన్ని పూర్తి చేశారు. మూడేళ్ల క్రితం నిర్మాణ పనులు పూర్తి కాగా, వీటి నిర్మాణం నాసిరకంగా సాగడంతో అండర్ బ్రిడ్జి రోడ్ అంతా కంకర తేలి గుంతలమయమై నరకానికి నకలుగా మారాయి. వర్షాకాలంలో ఆ గుంతల్లో పెద్ద ఎత్తున నీరు నిల్వ ఉండడంతో గుంతలు కానరాక, నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. ఆటోలు, ట్రాక్టర్లు, వ్యాన్లు, స్కూల్ బస్సులు సైతం ఆ నీటిలో ఇరుక్కుపోయిన ఘటనలు కోకొల్లలు. అయినప్పటికీ ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధి కనబరచడం లేదనే విమర్శలు ఉన్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించినా ప్రజలకు రోడ్డు కష్టాలు తప్పకపోవడంపై వాహన చోదకులు, గ్రామీణులు తీవ్ర ఆగ్రహం చెందుతున్నారు.

రాత్రి వేళ ఇబ్బంది అయితంది



అండర్ బ్రిడ్జి రోడ్డంతా అధ్వానంగా తయారైంది. రాత్రి సమయంలో రాకపోకలు సాగించాలంటే మరీ ఇబ్బంది అవుతుంది. ఏ గుంతల్లో పడి కింద పడతామో తెలియకుండా ఉంది. అధికారులు సమస్య పై దృష్టి సారించాలి.

– ఎలుక అనిల్, కొత్తపల్లి

ఆటోలు చెడిపోతున్నయ్..



రైల్వే అండర్ బ్రిడ్జిల్లోని గుంతల వల్ల ఆటోలు చెడిపోతున్నాయి. ఒక్కోసారి ఆ నీటిలో ఆటోలు ఇరుక్కుపోవడం వల్ల ఇంజన్లు సైతం పాడవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు అండర్ బ్రిడ్జిల రోడ్డును సరిచేసి నీరు నిల్వ ఉండకుండా చూడాలి.

– శన్ను, ఆటో డ్రైవర్, తాండూర్

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్



కోటపల్లి: గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ



బుద్దారంలో వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ

- కన్నెపల్లి, బుద్దారం, జనగామ గ్రామాల్లో కార్డన్ సెర్చ్
- పత్రాలు లేని వాహనాలు, నాటుసారా, బెల్లం స్వాధీనం

కోటపల్లి: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపడుతున్నట్లు సీఐ సుధాకర్ అన్నారు. జనగామ గ్రామంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించి 40వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ సుధాకర్ వివరించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో ప్రస్తుత పరిస్థితులను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: రామగుండం పోలీస్ కమిషనర్, మంచిర్యాల డీసీపీ ఆదేశాల మేరకు మండలంలోని కన్నెపల్లి, బుద్దారం గ్రామాల్లో చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 21ద్విచక్రవాహనాలు, 3ఆటోలు, ఒక టాటా ఏసీ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రెండు గ్రామాల్లో నాటుసారా స్థావరాలను గుర్తించి 15లీటర్ల నాటు సారా, 10కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రామగుండం సీపీ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఈ గ్రామాలు నక్సలైట్ ప్రభావిత ప్రాంతాలు, కావునా ఎటువంటి రెచ్చగొట్టే ప్రసంగాలకు ప్రభావితం కాకుండా ఉండాలన్నారు. నాటుసారా తయారు చేయొద్దని, నాటుసారా, గంజాయికి అలవాటు పడొద్దని సూచించారు. యువత సన్మార్గంలో నడవాలని పేర్కొన్నారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో పోలీసుసిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులపై సమీక్ష

మందమర్రిరూరల్/వేమనపల్లి/భీమిని/భీమారం: ఉపాధి హామీ పనులపై మందమర్రి, వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయాల్లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మందమర్రిలో ఎంపీడీవో రాజేశ్వర్, వేమనపల్లిలో ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి ఉపాధి హామీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో ఉదయం 11గంటలకు పనులు ముగించుకునే విధంగా చూడాలని, ప్రతి గ్రామ పంచాయతీల్లో కూలీలను పెంచాలని, వారికి కనీస సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించాలని, రూ.300 కనీస వేతనం అందేలా చూడాలన్నారు. మార్కింగ్ ఇచ్చి పని జరిగేలా చూడాలన్నారు. భీమిని మండలంలోని బిట్టూర్‌పల్లి, మల్లీడి, భీమిని గ్రామపంచాయతీల్లో జరుగుతున్న ఈజీఎస్ పనులను ఎంపీడీఓ గంగ మోహన్,



పోతన్‌పల్లిలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

భీమారం మండలంలోని పోతన్‌పల్లి సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో రాధ పరిశీలించారు. పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. వేసవికాలంలో ఉపాధికూలీలు వడదెబ్బకి గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

సీఐటీయూ బ్రాంచ్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ బ్రాంచ్ సీఐటీయూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆ యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. బ్రాంచీ అధ్యక్షుడిగా మరోసారి గుల్ల బాలాజీని ఎన్నుకున్నారు. బ్రాంచీ కార్యదర్శిగా అంబాల శ్రీనివాస్, ఆర్గనైజర్‌గా వెంగళ శ్రీనివాస్, కోశాధికారిగా కస్తూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా సాయిల శ్రీనివాస్, పెరిక సదానందం, తోడు సుధాకర్, బోడకుంట శంకర్, మహేశ్, వెంకటేశ్, బానేశ్, అభిలాష్ జాయింట్ సెక్రెటరీలుగా అజయ్, శ్రీధర్, సిరికొండ



గుల్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్

శ్రీనివాస్‌తో పాటు పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని నాయకులు సూచించారు.

వైభవంగా ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట బెటాలియన్ ఎదురుగా గల గోవింద క్షేత్రంలో నిర్వహిస్తున్న గోవిందరాజస్వామి సహిత భూవరాహస్వామి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం ఉదయం అగ్ని ప్రతిష్ఠ, పంచగవ్య ప్రోక్షణ, విశేష హవనములు, సాయంత్రం వేళ వాస్తు ఆరాధన, క్షీర, జలాధివాసాలు, నిత్యహవన, పూర్ణాహుతి కార్యక్రమాలను త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయరుస్వామి మంగళశాసనముల పర్యవేక్షణలో వేద పండితుల వేదమంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం సామూహిక లక్ష్మీ అష్టోత్తర విష్ణు సహస్రనామ పారాయణం చేసి తీర్థ



పూజల్లో పండితులు, భక్తులు

గోష్టి నిర్వహించారు. నాలుగో తేదీ గురువారం గోవిందరాజస్వామి, భూవరాహస్వామి దేవతా విగ్రహాల ప్రాణప్రతిష్ఠకు గ్రామ, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ కోరింది.

అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట గ్రామ అంబేద్కర్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు లింగంపల్లి బాపు తెలిపారు. అధ్యక్షుడిగా దుర్గం రవీందర్, ఉపాధ్యక్షులుగా మంత్రి కమలాకర్, ముల్కల్ల సురేష్, జాడి వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా దినేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా శంకర్, ప్రశాంత్, వెంకటేష్, ప్రచార కార్యదర్శులుగా రాజేందర్, రవితేజ, అంజన్న, సలహాదారులుగా పోతలింగం, అరవింద్, రాజన్నలను ఎన్నుకున్నారు.

కుమ్మరుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

- సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్

పాతమంచిర్యాల: కుమ్మరుల అభివృద్ధి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కుమ్మర సంఘం ఉపాధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్ మంగళవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. సంఘం భవన నిర్మాణానికి జిల్లా కేంద్రంలో 3గుంటల భూమి, కుమ్మరులు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి జిల్లా పరిధిలో 3ఎకరాల భూమి, పనిముట్ల కోసం ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఇజ్జగిరి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం నాయకులు

రామస్వామి, జిల్లా అధ్యక్షుడు గంగాధర తిరుపతి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాంపల్లి తిరుపతి, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు పాపన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, రాజ్‌కుమార్‌గౌడ్, పోషగౌడ్ తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ రక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్ అన్నారు. స్థానిక పాత మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 2న అలంపూర్‌లో ప్రారంభమైన రక్షణయాత్ర 5న మంచిర్యాల జిల్లాకు చేరుకుంటుందన్నారు. అంబేద్కర్ వాదులు జిల్లాకు వచ్చే యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జ అంకులు, జై భీమ్ సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేశ్, చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు శీలం వెంకటేశ్, నాయకులు పెండ్యాల శ్రీకాంత్, భీమ్ మధు, సంజయ్, రాదండి కిష్టయ్య, సుమంత్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సెట్‌బ్యాక్ వదిలి నిర్మాణాలు చేపట్టాలి

- మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య

పాతమంచిర్యాల: సెట్‌బ్యాక్ స్థలం వదిలిపెట్టి నిర్మాణాలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. పట్టణంలోని అర్చన టెక్స్ చౌరస్తా వద్ద సెట్‌బ్యాక్ స్థలం వదలకుండా షట్టర్ల నిర్మాణాలను ముందుకు జరిపి నిర్మించిన భవనాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెట్‌బ్యాక్ స్థలం వదిలిపెట్టి నిర్మించాల్సిన భవనం ముందుకు జరిపి నిర్మాణం చేస్తుండడంతో పలు ఫిర్యాదులు అందాయయన్నారు. సెట్‌బ్యాక్ స్థలంలో నిర్మించిన నిర్మాణాలను రెండు రోజుల్లో తొలగించాలని యజమానులను హెచ్చరించారు. లేనిపక్షంలో మున్సిపల్ సిబ్బంది ద్వారా తొలగించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్లు రామగిరి బానేష్, పోరేటి రాజు ఉన్నారు.

నీటితొట్టి ఏర్పాటు

దండేపల్లి: మండలం వెల్గనూర్‌లో మూగజీవాల దాహార్తి తీర్చడం కోసం గ్రామంలోని ప్రజాసేవ రైతు సేవాసంఘం వారు రూ.45వేల వ్యయంతో నీటి తొట్టి నిర్మించి అందులో నీళ్లు నింపి ఉంచుతున్నారు. దీంతో ఎండ సమయంలో గ్రామంలోని పశువులు నీటితొట్టి లోని నీళ్లు తాగి దాహార్తిని తీర్చుకుంటున్నాయి.



‘నవోదయ’కు ఎంపిక

జన్నారం: నవోదయ ఎంపిక పరీక్షలలో జన్నారం మండలకేంద్రంలోని స్లేట్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అర్హత సాధించారని స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన స్లేట్ హైస్కూల్‌కు చెందిన కాంద్రపు అశ్విత్, కొత్తపల్లి రిషిత్, స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన దుంగావత్ హర్షిత్‌నాయక్, అనుముల సహస్రలు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల అడ్మినిస్ట్రేటర్ రజిత, ఉపాధ్యాయులు అభినందించారు.



అశ్విత్



రిషిత్



అర్షిత్ నాయక్



సహస్ర

సామగ్రి అందజేత

నస్పూర్: పట్టణ పరిధిలోని విలేజ్ నస్పూర్‌కి చెందిన యాదగిరి–రాజక్క దంపతుల కుమార్తె వివాహానికి ప్రజా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు బీరువా, కూలర్, బియ్యం, స్టూల్స్‌ను మంగళవారం ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్, తస్నీరు రవికుమార్, సుద్దాల ప్రభుదేవ్, నదిపాట రాజు, గండ్ల సందీప్, ఎండీ జావిద్ పాషా, చరణ్, సుదీర్, సుజిత్, సాయి, రవి, సతీష్, సన్నీ పాల్గొన్నారు.

వీడిన స్కూల్ బస్సు డ్రైవర్ మృతి మిస్టరీ

- ఇంటికి పిలిపించి హత్య చేసినట్లు గుర్తించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు

తాండూర్: మండల కేంద్రంలో కలకలం రేపిన ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ అజ్జర్ అలీ(33) మృతి మిస్టరీ వీడింది. హత్య చేసినట్లుగా గుర్తించిన పోలీసులు మంగళవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తాండూర్ సీఐ కుమారస్వామి కథనం ప్రకారం... శనివారం రాత్రి ఇంట్లో నుంచి అదృశ్యమైన తాండూర్ మండల కేంద్రంలోని సుభద్ర కాలనీకి చెందిన అజ్జర్ అలీ సోమవారం అబ్బాపూర్ ఓపెన్‌కాస్ట్ గని పరిసరాల్లో మృతి చెంది కనిపించాడు. అయితే అతడి మరణంపై అనుమానంతో పోలీసులు తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టడంతో హత్య చేసినట్లుగా నిర్ధారణ అయింది. అఫ్రినా బేగం.. అఫ్జల్, రెహనాన్‌తో కలిసి హత్యకు పాల్పడ్డట్లు సీఐ తెలిపారు. పథకం ప్రకారం హత్యచేసి అజ్జర్ అలీ ఆత్మహత్య చేసుకున్నట్లు నిందితులు చిత్రీకరించినట్లు దర్యాప్తులో తేల్చారు. అఫ్రినా బేగంను మృతుడు లైంగికంగా వేధించడంతో ఆమె తన భర్త అఫ్జల్‌కు చెప్పగా, తోడల్లుడు రెహనాన్‌తో కలిసి అజ్జర్ అలీని హత్య చేసినట్లు వివరించారు. ఇంట్లో ఎవరూలేరని అజ్జర్ అలీని అఫ్రినా బేగం ఇంటికి ఆహ్వానించి, ఇనుపరాడ్‌తో తలపై కొట్టి, తీగతో గొంతుకు ఉరి వేసి హత్య చేసినట్లు వివరించారు. ఈ మేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు పంపించినట్లు సీఐ వెల్లడించారు.

మద్యం మత్తులో ఘర్షణ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఓ టీ స్టాల్ వద్ద మద్యం మత్తులో టీ స్టాల్ యజమానిపై ఓ యువకుడు ఘర్షణకు దిగిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. ఆలుబోజు రాజుకు చెందిన టీ స్టాల్‌కు మంచిర్యాలకు చెందిన వేల్పుల సంజయ్ అనే యువకుడు మద్యం మత్తులో వచ్చాడు. రాజుతో గొడవకు దిగి వస్తువులను చిందవందర చేయడంతో సంజయ్‌ను చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. సంజయ్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించి, ఇరువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించి విచారిస్తున్నామని ఎస్సై తెలిపారు.



గొడవకు దిగిన సంజయ్